క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు

సుండుపల్లె (వీరబల్లి) : మండల పరిధిలోని చిన్నగొల్లపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ జయచంద్ర చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నాయని, ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు.

నివాళి



జనార్దన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాయచోటి టౌన్ : అంతర్జాతీయ హాకీ అంపైర్, సీనియర్ హాకీ క్రీడాకారుడు జనార్దన్ రెడ్డి మొదటి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. రాయచోటి విద్యాసంస్థలలో మంగళవారం హాకీ క్రీడాకారులు, రాజు విద్యాసంస్థల హాకీ అకాడమీ ఫౌండర్ సీవి చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు సదాశివరెడ్డి, ఉమాదేవి, కార్యదర్శి నాగేశ్వరావు, ఖదీరుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాయచోటి కన్వీనర్‌గా అరమాటి శివగంగిరెడ్డి



శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీ నాయకులు

రాయచోటి టౌన్ : బీజేపీ రాయచోటి నియోజకవర్గ కన్వీనర్‌గా అరమాటి శివగంగిరెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు నుంచి ఆదేశాలు అందినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర బీజేపీ కార్యాలయం నుంచి నియమాకపత్రం అందినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గ బీజేపీ నాయకులు కలసి అభినందనలు తెలియజేశారు.

జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

సంబేపల్లె : ప్రజా సంఘాల పిలుపు మేరకు ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీలో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర మంగళవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న ప్రధాని మోడీ తీరుకు నిరసనగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం దేవపట్లలో పలు డిమాండ్‌లతో కూడిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల బృందం

పెనగలూరు : మండలంలోని నల్లపరెడ్డిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి ఇద్దరు విద్యార్థులు ఎన్ఎంఎం స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రమణయ్య శెట్టి తెలిపారు. 8వ తరగతి చదువుతున్న జె.విష్ణువర్దన్, కె.భరత్ అనే విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం మెమెంటో అందించి అభినందించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ములకలచెరువు : కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం చేసుకొని ఒక కారును సీజ్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పులికల్లు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక ఇండిగో కారు నిలపకుండా వెళ్లడంతో సిబ్బందితో కారును వెంబడించి పోకనాటువారిపల్లె వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. డ్రైవర్, మరో యువకుడు తప్పించుకొని పారిపోగా, కారులో 25 కేసుల మద్యం ఉండటంతో సీజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం కారు యజమాని కే.భరత్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

టైలరింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరంలోని ఎస్ఎస్ సొల్యూషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇస్తామని సెంటర్ హెడ్ యూసుఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులని.. వీరికి 4నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. మొదటి బ్యాచ్ ఉదయం 9గంటల నుంచి 1 గంటవరకు, రెండవ బ్యాచ్ 1.30 నుంచి సాయంత్రం 5.30 వరకు ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 70954 99870, 81060 59836 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అక్కాచెల్లెమ్మలకు బాసటగా వైఎస్ఆర్ ఆసరా

- మహిళా సాధికారతే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం
- ఊపిరి ఉన్నంతవరకు రాయచోటి అభివృద్ధికి కృషి
- ఆసరా వారోత్సవాలలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



పెద్దఎత్తున హాజరైన డ్వాక్రా మహిళలు



మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : అక్కాచెల్లెమ్మలకు బాసటగా వైఎస్ఆర్ ఆసరా నిలుస్తోందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని మాసాపేట, మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ఆసరా 3వ విడత వారోత్సవ సభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో మహిళలకు జగనన్న ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నారంటూ చెప్పారు. 3 విడత ఆర్థికసహాయాన్ని అందించారన్నారు. గత ప్రభుత్వాలు డ్వాక్రా మహిళలను తమ సభలు, సమావేశాలకు తరలించుకున్నారే తప్ప వారికి ఎలాంటి లబ్ధిని చేకూర్చిన పాపాన పోలేదంటూ తెలిపారు. రాబోయే ఎన్నికల సమయానికి ఆయా సంఘాలకు బ్యాంకులలో ఉన్న రుణాన్ని 4 విడతలుగా మాఫీ చేసినట్టు చెప్పారు.

జగన్ మాట నిలబెట్టుకున్నాడు

ఎన్నికల సమయంలో, మేనిఫెస్టోలోనూ చెప్పింది చెప్పినట్లుగా చేస్తున్న మనస్సున్న, దమ్మున్న సీఎం జగన్ అని శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. 2014లో రూ.14వేల కోట్ల డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తానని చెప్పి చంద్రబాబు మాట తప్పారన్నారు. అదే జగనన్న సీఎం అయిన వెంటనే రూ.27వేల కోట్ల డ్వాక్రా రుణాలను నాలుగు విడతలలో మాఫీ చేస్తానని చెప్పి ఇప్పటికే 3 విడతలుగా రుణమాఫీ చేసి మాటను నిలబెట్టుకున్నారంటూ తెలిపారు. డ్వాక్రా మహిళలను లక్షాధికారులను చేసేదిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా కృషిచేస్తానన్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రజలకు 4 పట్టణ ఆరోగ్యకేంద్రాలు అందుబాటులోకి వచ్చాయని, 100 పడకల ఆసుపత్రి నిర్మాణం పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేస్తున్నామంటూ చెప్పారు. రాష్ట్రంలో ఏకకాలంలో 1.30 లక్షల మందికి సచివాలయ ఉద్యోగాలను కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు.

బాబుపాలనలో శాశ్వత అభివృద్ధి పథకం ఒక్కటి లేదు

చంద్రబాబు పరిపాలనలో చెప్పుకోదగ్గ అభివృద్ధి పథకం ఒకటి లేదని శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. అదే మహానేత వైఎస్ఆర్, జగనన్నల పాలనలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నట్లు చెప్పారు. జగనన్నకు ప్రజాబలం ఉందని, తోడేళ్లు, గుంటనక్కలన్ని ఏకమైనా ఆయనను ఏమిచేయలేవన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ తబ్రేజ్‌ఖాన్ మైనార్టీ జిల్లానేత బేపారి మహమ్మద్‌ఖాన్, మదనపల్లె పరిశీలకుడు హబీబుల్లాఖాన్, కౌన్సిలర్లు సుగవాసి ఈశ్వర్, అల్తాఫ్‌లు ప్రసంగించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, కౌన్సిలర్ పద్మావతి, రౌనఖ్‌సుల్తాన్, గౌస్‌ఖాన్, వైఎస్ఆర్‌సీపీ నేతలు శ్యామ్‌కుమార్, నవరంగ్ నిస్సార్, అయ్యవారురెడ్డి, మైమున్నీసా, కొత్తిమీర ప్రసాద్, రియాజుర్ రహిమాన్, నవాజ్ క్రిష్, దేవేంద్ర, జావీద్, అమీర్, హజరత్ ఖాదర్‌వలీ, కొత్తపల్లె ఇంతియాజ్‌తో పాటు పలువురు అధికారులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ప్రతి మహిళ జగనన్నకు అండగా నిలవాలి

– ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



చిట్వేలి: సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

చిట్వేలి : రాష్ట్రంలో ఆర్థికలోటు ఉన్నా మహిళా సాధికారతే లక్ష్యంగా మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పని చేస్తున్నారని రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వైఎస్సార్ ఆసరా మూడో విడత వారోత్సవాలలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాలలో ప్రతిపథకాన్ని నేరుగా మహిళలకు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రతి మహిళ అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మండలంలోని 446 స్వయం సహాయక గ్రూపులకు రూ. 3.16 కోట్ల మెగా చెక్కును ఎమ్మెల్యే మహిళలకు అందజేశారు. అనంతరం మహిళలు జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించడంతోపాటు ఎమ్మెల్యే కొరముట్లను ఘనంగా సన్మానించారు. ఎల్‌వీ మోహన్ రెడ్డి, ఎంపీపీ చంద్ర, ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం రెడ్డి, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ మోహన్, ఎస్ఐ సుభాష్ చంద్రబోస్, సిబ్బంది, స్వయం సహాయక సంఘం అధికారులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పుల్లంపేటలో..

పుల్లంపేట : నేడు బుధవారం పుల్లంపేటకు ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ద్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత నగదు చెక్కును అందజేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు.

సత్యమ్మను దర్శించుకున్న ప్రభుత్వవిప్

రైల్వేకోడూరు : తంబిళ్లవారిపల్లెలో కొలువై ఉన్న సత్యమ్మ తల్లిని మంగళవారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వేదపండితుల సమక్షంలో నూతనంగా సత్యమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట చేసి ప్రత్యేక హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో పంజం సుకుమార్‌రెడ్డి, సుధాకర్‌రాజు, ఎంపీటీసీలు బండారు మల్లికార్జున, జనార్దన్‌రాజులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆశాజ్యోతి సీఎం వైఎస్ జగన్

ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా

ఒంటిమిట్ట : ఆంధ్ర రాష్ట్ర మహిళలకు ఆశాజ్యోతి మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవనం ఆవరణలో వైఎస్సార్ ఆసరా 3వ విడత సంబరాల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి ఒంటిమిట్ట మండలంలోని 537 స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు రూ. 4.79 కోట్లు, సిద్ధవటం మండలంలోని 665 స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు రూ. 6.17కోట్లు విలువైన వైఎస్సార్ ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. ముందుగా సీఎం జగన్ చిత్రపటానికి డ్వాక్రా మహిళలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రాష్ట్రంలో ఉన్న మహిళలను దృష్టిలో ఉంచుకుని అనేక పథకాల ప్రవేశపెట్టారన్నారు. మహిళలకు అండగా ఉంటున్న సీఎం జగన్‌కు 2024లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డినే గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం జెడ్పీ చైర్మన్ ఆకేపాటి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, స్వతంత్రంగా ఎదగాలనే ఉద్దేశంతో మహిళలను లబ్ధిదారులగా చేస్తున్నారని తెలిపారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అభివృద్ధికి రెండు అడుగు వేస్తే, ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాలుగు అడుగులు ముందుకు వేశారని చెప్పారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ గెడ్డం జనార్దన్ రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, సిద్ధవటం జెడ్పీటీసీ ఉపాసి శ్రీకాంత్‌రెడ్డి, ముమ్మడి శ్రీధర్‌రెడ్డి, ఒంటిమిట్ట, సిద్ధవటం మండల ఏపీఎంలు నాగార్జున నాయుడు, వెంకటేష్, ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశంలో..

ఒంటిమిట్ట మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు సమష్టిగా కృషి చేయాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి సంబంధిత అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో మంగళవారం వైస్ ఎంపీపీ గెడ్డం జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులతో మండలంలో జరిగిన అభివృద్ధి పనుల గురించి, ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీ, సర్పంచులు తెలిపిన సమస్యల గురించి వాటి పరిష్కారాల గురించి చర్చలు జరిపారు. ఎమ్మెల్యే మేడా మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు జల శక్తి మిషన్ కింద మండలానికి మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జెడ్పీ చైర్మన్ ఆకేపాటి మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశం అంటే ప్రజా సమస్యలను తెలసుకుని, వాటి పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలన్నారు. అంతే తప్పా వచ్చాం, విన్నాం పోయాం అన్నట్టు ఉండకూడదని తెలిపారు. వేసవిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. జిల్లా పరిషత్ తరఫున మండల అభివృద్ధి కోసం ఎలాంటి సాయం చేయాలన్న ముందుంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులరెడ్డి, ఎంపీడీవో రెడ్డయ్య, ఈవోపీఆర్‌డీ రంగయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు రఫీ, ఎంపీటీసీలు, సర్పంచులు, మండలంలోని వివిధ శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి

సిబ్బందికి సూచించిన రాయచోటి కమిషనర్ గంగాప్రసాద్



డంపింగ్ యార్డ్ రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్

రాయచోటి అర్బన్ : రాయచోటి పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కమిషనర్ గంగా ప్రసాద్ పారిశుధ్య విభాగం అధికారులకు సూచించారు. మంగళవారం ఉదయం మున్సిపల్ కార్యాలయానికి విచ్చేసి పారిశుధ్య కార్మికుల హాజరును, మస్టర్ పుస్తకాలను పరిశీలించారు. అక్కడే ఉన్న కార్మికులు, యూనియన్ నేతలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి తనవంతు కృషి సల్పుతానంటూ భరోసా ఇచ్చారు. అనంతరం పట్టణ శివార్లలో శెట్టివాండ్లపల్లె రోడ్డు వద్ద ఉన్న డంపింగ్ యార్డును కమిషనర్ పరిశీలించారు. అక్కడున్న తడిచెత్త, పొడిచెత్త నిర్వహణ ప్రాజెక్టులను పరిశీలించారు. ప్రతిరోజు పట్టణం నుంచి డంపింగ్‌యార్డుకు ఎన్ని ట్రిప్పుల వ్యర్థ పదార్థాలు ట్రాక్టర్లు,ఆటోల ద్వారా వస్తుందంటూ అడిగి తెలుసుకున్నారు. డంపింగ్ యార్డు నిర్వహణ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా రోడ్డు విస్తరణ పనులు



రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న దృశ్యం

రాజంపేట : కడప– రేణిగుంట నేషనల్ హైవేలోని చెయ్యేరు వంతెన నుంచి రాజంపేట వైపు వెళ్లే మార్గంలో రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. నిబంధనలను పాటిస్తూ రూ.4.25 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఫలితంగా చెయ్యేరు బ్రిడ్జికి సమీపంలో ప్రమాదాల నివారణకు దోహదపడినట్లయింది. రక్షణ గోడలు పటిష్టంగా తయారై వరదల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం తప్పిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో సాయిబాబా, అగస్త్యేశ్వర ఆలయాలు ఉండటంతో భక్తులకు ఇబ్బందులు తొలగినట్లయింది. రోడ్డు విస్తరణ విషయమై ఎస్‌హెచ్ ఈఈ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మితమవుతోందని, వీలైనంత త్వరలో విస్తరణ చేసిన రోడ్డును అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యం

సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యమని.. స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ద్వారా క్రమశిక్షణ తోపాటు నైతిక విలువలు రూపుదిద్దుకుంటాయని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడప శంకరాపురం స్కౌట్ ప్రాంతీయ కార్యాలయంలో స్కౌట్ మాస్టర్ల, గైడ్స్ కెప్టెన్లకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులలో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక సేవ, దేశభక్తి పెంపొందించడానికి స్కౌట్ శిక్షణ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. బేసిక్, అడ్వాన్స్‌డ్ శిక్షణ పొందిన వారే తమ విద్యార్థులకు సమగ్రమంగా శిక్షణ ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. యూనిట్ లీడర్లు అందరూ సేవాభావం కలిగి క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కౌట్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమీషనర్ లక్ష్మీకర్, అసిసెంట్ సెక్రటరీ శివప్రసాద్, ట్రెజరర్ రమణయ్య, ఏఎల్‌టీసీలు, వెంకటేశ్వర్లు, శకుంతలమ్మ, శంకర మ్మ, ఎస్‌టిసిలు ఉపాదేవి, మోహన్‌రావు, ఎస్‌ఓసీలు శివ ప్రసాద్, రజియాబేగం, రెండు జిల్లాల స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు తదితరులు పాల్గొన్నారు.

బల్లలు ఏర్పాటు



విశ్రాంత బల్లల వద్ద మానవత ప్రతినిధులు

రాజంపేట రూరల్ : పట్టణంలోని ఆర్‌టీసీ బస్టాండు, ఎన్టీఆర్ సర్కిల్, ఏరియా ఆసుపత్రి, ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానం వద్ద మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విశ్రాంత బల్లలను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ విశ్రాంత బల్లలను ఏరియా ఆసుపత్రి సూపర్‌డెంట్ ఎస్వీ నాగేశ్వరరాజు ప్రారంభించి మానవత ప్రతినిధులను అభినందించారు. ఈ సందర్భంగా మానవత రాజంపేట శాఖ అధ్యక్షుడు వై.నందకిషోర్‌గౌడ్ మాట్లాడుతూ మానవత తరఫున పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో మానవత డైరెక్టర్ పీసీఎస్ మూర్తి, జిల్లా సంయుక్త కార్యదర్శి ఎస్.అబ్దుల్లా, బండి సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న ఆసరా పంపిణీ కార్యక్రమం

రామాపురం : మండలంలోని డ్వాక్రా సంఘాలకు సంబంధించి వైఎస్సార్ ఆసరా సమావేశాన్ని ఏప్రిల్ 5న నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కన్వీనర్ జనార్దన్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఆసరా సమావేశానికి డ్వాక్రా సంఘాల మహిళలు, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు హాజరుకావాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి, ఉప మండల అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఆదిరెడ్డి, ఎంపీటీసీ శివ, మండల అభివృద్ధి అధికారి హైదర్ వలీ తదితరులు పాల్గొన్నారు.

ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భోజనాలు



విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం

నందలూరు(రాజంపేట) : జనాబ్ ఎస్టీ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి జన్మదిన సందర్భంగా నాగిరెడ్డిపల్లె జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు భోజనాలు వడ్డించారు. ట్రస్టు అధినేత, ఏజీపీ షమీవుల్లాఖాన్ మాట్లాడుతూ ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గంగిరెడ్డి, సర్పంచ్ సూర్యనారాయణ, మండల కో–ఆప్షన్ సభ్యుడు కలీం, నడివీధి సుధాకర్, పల్లె మాధవీ, మాజీ ఎంపీటీసీ స్వామి ఏలుమలై, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన కల్పించండి



చిరుధాన్యాలతో అంగన్‌వాడీ వర్కర్లు

లక్కిరెడ్డిపల్లి : చిరుధాన్యాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో పోషణ్ పఖ్వాడాపై అంగన్‌వాడీ వర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ పద్మావతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలను ఉపయోగిస్తే ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. రాగులు, సజ్జలు, గోధుమలు, వేరుశనగలు, పిండి పదార్థాలు ఉపయోగిస్తే ఆరోగ్యకరంగా జీవిస్తారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న బాలామృతం మూడు నుంచి ఆరు సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు ఈ ఆహారాన్ని తప్పకుండా అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అరుణకుమారి, పద్మజ, తులసమ్మ, డ్వామా డీపీఓ లత, ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పోలవరం ఎత్తును తగ్గిస్తే రాయలసీమకు నష్టం



రిలే నిరాహార దీక్షలను చేస్తున్న దృశ్యం

రాయచోటి అర్బన్ : పోలవరం ప్రాజెక్టు ఎత్తును, నీటినిల్వ సామర్థ్యాన్ని తగ్గించి నిర్మిస్తే రాయలసీమకు తీరని నష్టం వాటిల్లుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.యల్.నరసింహులు అన్నారు. పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల కాంటూరు ఎత్తులో నిర్మించి తీరాలని సీపీఐ రాష్ట్రసమితి ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం కలెక్టరేట్ ఎదుట 2వరోజు రిలేనిరాహార దీక్షలు కొనసాగాయి. 2వ రోజు దీక్షలకు జనసేననేత శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ నేతలు మనోహర్, రామాంజులు, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు యుగంధర్‌లు హాజరై తమ మద్దతును ప్రకటించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, జిల్లానేతలు సిద్దిగాళ్ల శ్రీనివాసులు, జ్యోతిచిన్నయ్య, మండెం సుధీర్‌తో పాటు పలువురు సీపీఐ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జరిమానా

సంబేపల్లె : మద్యం తాగి ద్విచక్రవాహనాలు నడిపిన ఇద్దరు వ్యక్తులకు రాయచోటి న్యాయస్థానంలో జరిమానా విధించినట్లు సంబేపల్లె ఎస్ఐ షరీఫ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు ఈ నెల 19 తేదీన మండల పరిధిలోని జాతీయ రహదారిపై కొండావాండ్లపల్లె క్రాస్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడిపిన ఇద్దరు వ్యక్తులపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశామన్నారు. మంగళవారం వారిని కోర్టులో హాజరుపరుచగా రాయచోటి ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఇష్రాత్ ఫాతిమా మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి రూ. 21,500 జరిమానా విధించినట్లు తెలిపారు.

దైవ చింతనతోనే మంచికి మార్గం



రాయచోటి : ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : దైవ చింతనతో జీవితంలో చక్కని క్రమశిక్షణ, ఓర్పు, సేవా భావాలు కలుగుతాయని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటి పట్టణం నిదా పాఠశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులు, ముస్లిం సోదరులతో కలిసి ఆయన ఇఫ్తార్ విందును స్వీకరించారు. కార్యక్రమంలో వైద్యుడు డాక్టర్ నారాయణ రెడ్డి, వీఆర్ రెడ్డి, నిదా కరస్పాండెంట్ నిస్సార్ అహ్మద్, బేపారి మహ్మద్ ఖాన్, కౌన్సిలర్ కొలిమి చాన్ బాషా, నవరంగ్ నిస్సార్, మూసా తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులలో వేగం పెంచాలి

నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న జాతీయ రహదారుల పనులలో వేగం పెంచాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటిలోని పార్టీ కార్యాలయంలో ఎన్‌హెచ్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. రాయచోటి– వేంపల్లి రహదారి నిర్మాణంలో భాగంగా లక్కిరెడ్డిపల్లెలోనూ, రాయచోటి బైపాస్ రోడ్డు నాలుగు వరుసల రహదారి నిర్మాణం, పట్టణంలోనూ, చిన్నమండెం పరిధిలో పెండింగ్ పనులపై ఆయన చర్చించారు. ఈ సమీక్షలో జాతీయ రహదారుల ఈఈ విజయభాస్కర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, మదనపల్లె పరిశీలకుడు హబీబుల్లా ఖాన్, డీఈ సుదర్శన్ రెడ్డి, ఏఈ రఘునాథబాబు, ఏఆర్‌కె కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధి బాలిరెడ్డి, వినీత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి తనిఖీ

రాయచోటి టౌన్ : వంద పడకల ఆస్పత్రి నిర్మాణాల పనులను రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీ కాంత్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. మంగళవారం సాయంత్రం ఆయన ఆస్పత్రికి వెళ్లి నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించి త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని అలాగే నాణ్యతలో రాజీ పడకుండా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ

రాయచోటి మాసాపేట వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన ముస్తాక్, రఫీలను రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. మంగళవారం ఆస్పత్రికి గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

రాయచోటి అర్బన్ : పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. మొదట మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్మాణ దశలో ఉన్న సభాభవనం పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం నిర్మాణ దశలో ఉన్న బస్టాండ్ ప్రాంగణాన్ని ఆయన క్షేత్ర స్థాయిలో అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.